సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ పావనీజంగయ్య, కమిషనర్ సాబేర్ అలీ

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలోని 17వ వార్డులో రూ. 4 లక్షల వ్యయంతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులు బుధవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య, కమిషనర్ సాబేర్ అలీతో కలిసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాకపోకలకు ఇబ్బందులు తలెత్తుతున్నాయన్న స్థానికుల విన్నపం మేరకు సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ మాధవరెడ్డి, కౌన్సిలర్ నర్సింగ్‌రావు, సుధాకర్, సన్నీ, స్థానికులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు దుస్తుల పంపిణీ



పారిశుద్ధ్య కార్మికులకు బట్టల పంపిణీ చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు బుధవారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి ఆధ్వర్యంలో దసరా పండుగ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు, ఎలక్ట్రీషియన్లకు దుస్తులు సబ్బులు, నూనె తదితర వస్తువులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కమిషనర్ నాగమణి, వైస్‌చైర్మన్ బండారి మల్లేష్ యాదవ్, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

నాలాపై కట్టడాలను ఉపేక్షించేది లేదు



ఘట్‌కేసర్: పట్టణంలో నాలాపై నిర్మిస్తున్న కట్టడాలను ఇరిగేషన్ ఏఈ పరమేశ్ జేసీబీ సాయంతో బుధవారం కూల్చివేయించారు. హైదరాబాద్–వరంగల్ జాతీయ రహదారి సర్వీస్ రోడ్డులో నాలాపై వ్యాపార సముదాయాన్ని నిర్మిస్తున్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్, నాలాపై నిర్మిస్తున్న కట్టడాలపై కఠినంగా వ్యవహరించాలన్న ప్రభుత్వఆదేశం మేరకు కూల్చివేయించామన్నారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ.. నాలాపై నిర్మిస్తున్న కట్టడాలను ఉపేక్షించేది లేదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా కట్టడాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్ గా నర్సింలు యాదవ్



మేడ్చల్: మేడ్చల్ మార్కెట్ కమిటీ చైర్మన్‌గా నర్సింలు యాదవ్‌ను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. చైర్మన్‌గా మూడు చింతలపల్లి మండలం కేశవరం గ్రామానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు మండల పార్టీ అధ్యక్షుడు బొమ్మలపల్లి నర్సింలు యాదవ్, వైస్ చైర్మన్‌గా గూగులోత్ నాయక్, డైరెక్టర్లుగా విజయ, నాగేశ్వర్, భిక్షపతి, మాధవరెడ్డి, శ్వేత, శివశంకర్, పూర్ణచంద్ర, బాల్‌రెడ్డి, వేణుగోపాల్, రేగురాజు శ్రీనివాస్, వినోద్‌లను నియమిస్తూ రాష్ట్ర వ్యవసాయ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

ప్రభుత్వ కార్యాలయ ప్రహరీ కూల్చివేత..!

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థకు అనుబంధంగా చెంగిచర్లలో ఉన్న పాత గ్రామపంచాయతీ కార్యాలయం ప్రహరీ, గేట్‌ను బుధవారం తెల్లవారుజామున కూల్చి వేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకుడు రోడ్డుపై బతుకమ్మ ఆడేందుకు స్థలం సరిపోవడంలేదని తొలగించారని సమాచారం. గేట్‌ను అదే కార్యాలయంలో ఓ పక్కన ఉంచారన్న సమాచారం తెలుసుకున్న మున్సిపల్ సిబ్బంది కమిషనర్ రామలింగం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే ఆయన కూల్చివేసిన ప్రాంతాన్ని గ్రీన్ పట్టతో కట్టించారు. ప్రస్తుతం చెంగిచర్ల ప్రాంతాన్ని చూసే బిల్ కలెక్టర్లు, శానిటరీ అధికారులు, మున్సిపల్ సిబ్బంది ఉపయోగించుకుంటున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రామలింగం మాట్లాడుతూ.. స్థానికంగా ఉన్న కొత్త గోపాల్‌గౌడ్ ప్రభుత్వ ఆస్తులను ధ్వంసం చేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, అతడిపై జేసీబీ నిర్వాహకులపై మేడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. ప్రహరీ, గేట్‌ను పునర్నిర్మించడంతో పాటు అతడిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

అనుమానాస్పద స్థితిలో లారీ డ్రైవర్ మృతి



సుక్వీందర్ మృతదేహం

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ ఓఆర్ఆర్ పరిధిలో అనుమానాస్పద స్థితిలో ఓ లారీ డ్రైవర్ బుధవారం మృతి చెందాడు. ఇన్‌స్పెక్టర్ పరుశురాం తెలిపిన వివరాల ప్రకారం.. హర్యానాకు చెందిన డ్రైవర్ సుక్వీందర్ (49) లారీని నడుపుకుంటూ 4 రోజుల కిందట హైదరాబాద్‌కు వచ్చాడు. ఓ ట్రావెల్స్ ఏజెన్సీ ద్వారా నల్గొండ జిల్లా చింతపల్లిలో కాటన్ నింపుకొని హర్యానా వెళ్తుండగా ఘనాపూర్ సమీపంలో ఓఆర్ఆర్‌పై డ్రైవింగ్ సీటులోనే అనుమానాస్పదంగా మరణించాడు. శరీరంపై ఎటువంటి గాయలు లేవు. డ్రైవింగ్ చేయడం ద్వారా అనారోగ్యం కారణంగాను మరణించి ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. పోస్ట్‌మార్టం నిమిత్తం శవాన్ని గాంధీ ఆసుపత్రికి తరలించారు. ట్రాన్స్‌పోర్ట్ ఏజెంట్ శంకర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అనారోగ్య కారణాలతో వ్యక్తి ఆత్మహత్య

ఉప్పల్: అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న ఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పల్ పారిశ్రామికవాడ లక్ష్మీనారాయణ కాలనీలో నివాస ఉండే చల్ల విజయ్‌కుమార్(38) గత కొన్ని రోజులుగా ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నాడు. కాగా మద్యానికి బానిసైన అతడు మంగళవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. భార్య తలుపులను బలవంతంగా తెరిపించి చూసేసరికే మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అంగరంగ వైభవంగా నవరాత్రోత్సవాలు



సరస్వతీ దేవిగా గడి మైసమ్మ అమ్మవారు



అక్షరాభ్యాసం కోసం చిన్నారులు

మేడ్చల్: దేవీ నవరాత్రి ఉత్సవాలలో 7వ రోజైన బుధవారం అమ్మవారిని సరస్వతీ దేవి రూపంలో అలంకరించి దర్శనం చేసుకున్నారు. వివిధ మండలపాల్లో, కాలనీల్లో, ఆలయాల్లో నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. గడి మైసమ్మ ఆలయంలో అమ్మవారిని రాజరాజేశ్వరి దేవిగా అలంకరించి దర్శనం చేసుకున్నారు. రాఘవేంద్రనగర్ కాలనీ, ఆర్టీసీ కాలనీ కట్టమైసమ్మ ఆలయం, అత్వెల్లి ఆలయంలో ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. చండీ హోమాలు, అన్నదాన కార్యక్రమాలు, లక్ష పూల అర్చన, కుంకుమార్చన వంటి కార్యక్రమాలు జోరుగా నిర్వహిస్తున్నారు. రాఘవేంద్రనగర్ కాలనీలో పూజల్లో భాగంగా సరస్వతీ అమ్మవారి రూపం కావడంతో నిర్వాహకులు 150 మంది చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు.

సరస్వతీ దేవి అలంకరణలో అమ్మవారు

కీసర: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు నాగారం, దమ్మాయిగూడ మున్సిపాలిటీల్లో వైభవంగా కొనసాగుతున్నాయి. బుధవారం కీసరగుట్ట శ్రీ భవానీశివదుర్గా అమ్మవారు సరస్వతీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కరీంగూడలో ఏర్పాటు చేసిన అమ్మవారి మండపం వద్ద నిర్వహించిన చండీ హోమంలో భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మరోవైపు రాంపల్లిలో దుర్గామాత మండపం వద్ద భక్తులు పెద్ద ఎత్తున అమ్మవారిని దర్శించుకున్నారు.



రాంపల్లిలోని దుర్గామాతను దర్శించుకుంటున్న భక్తులు



సరస్వతీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన కీసరగుట్ట అమ్మవారు

కొనసాగుతున్న దేవీ నవరాత్రులు

మేడ్చల్‌రూరల్: దేవీ శరన్నవరాత్రులు ఘనంగా కొనసాగుతున్నాయి. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో ఏర్పాటు చేసిన అమ్మవారిని బుధవారం జిల్లా బీజేపీ అధ్యక్షులు విక్రంరెడ్డి, కౌన్సిలర్లు మల్లిఖార్జున్ ముదిరాజ్, సరస్వతి, అసెంబ్లీ కన్వీనర్ మోహన్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షులు శ్రీనివాస్ ముదిరాజ్, బీజేపీ నాయకులు పూజలు నిర్వహించారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి పూడూర్ గ్రామంలోని అమ్మవారి మండపం వద్ద అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సరస్వతీ దేవి అలంకరణలో దుర్గామాత

పోచారం: కొర్రెములలోని కురుమల లక్ష్మీనగర్‌లో కొలువుదీరిన దుర్గామాత బుధవారం రోజున సరస్వతీదేవిగా పూజలందుకున్నారు. ఈ సందర్భంగా స్థానిక మాజీ వార్డు సభ్యుడు గొబ్బిరి మన్యం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకొన్నారు.



కురుమల లక్ష్మీనగర్‌లో కొలువైన దుర్గామాత

ఘట్‌కేసర్ సీఐగా పరశురాం



ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ పోలీస్ స్టేషన్ నూతన ఇన్‌స్పెక్టర్‌గా పరశురాం బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ట్రాఫిక్ సీఐగా విధులు నిర్వహించిన పరశురాం ఇన్‌స్పెక్టర్‌గా బదిలీపై వచ్చాడు. ఈ సందర్భంగా నూతన సీఐ మాట్లాడుతూ.. 24 గంటలు ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు.

జవహర్‌నగర్ సీఐగా సైదయ్య



జవహర్‌నగర్: జవహర్‌నగర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా సైదయ్య పదవీ బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు అక్కడ పనిచేసిన నాగరాజు సైబర్ క్రైమ్‌కు బదిలీ అయ్యారు. కుషాయిగూడ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన సైదయ్య బుధవారం ఇన్‌స్పెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సైదయ్య మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ప్రజలు ఏవైనా సమస్యలు ఉంటే నేరుగా వచ్చి నిర్భయంగా చెప్పుకోవాలని తెలిపారు.

విద్యార్థులకు నోట్‌బుక్స్ పంపిణీ

ఉప్పల్: బిర్లా ఫౌండేషన్ నల్లూరి శ్రీనివాస్, జీహెచ్‌కే హరీష్ ఆధ్వర్యంలో ఉప్పల్ వెలుగుట్టలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు గొరిగే మల్లేష్, గణేష్‌నాయక్, కిషన్‌నాయక్, పెద్ద మల్లేష్, నర్సింగ్, కళ్యాణం గీతారాణి, సూర్యప్రకాష్ తదిరతులు పాల్గొన్నారు.



ఎస్సీ రిజర్వేషన్లు అమలు చేయాలి

సాక్షి,సిటీబ్యూరో: సుప్రీం కోర్టు తీర్పును అనుసరించి ఉద్యోగ నియామకాల్లో ఎస్సీ రిజర్వేషన్లను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. బుధవారం ఎమ్మార్పీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో తూముకుంట అంబేద్కర్ విగ్రహం నుంచి మేడ్చల కలెక్టరేట్ వరకు కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని జిల్లా అదనపు కలెక్టర్‌కు అందజేశారు. ఎస్సీ వర్గీకరణ అమలులోకి వచ్చేంత వరకు ఉద్యోగ నియామకాలు పూర్తిగా నిలిపివేయాలని వారు కోరారు. ఏ ఉద్యోగ నియామకాలైన ఎస్సీ వర్గీకరణను అమలు చేసిన తరువాతనే చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు ప్రణయ్ మాదిగ, రాంచందర్, శంకర్, శివ, శేఖర్, నరేందర్, మహిళలు, అనుబంధ విభాగాల కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుల అభివృద్ధికి కృషి



పెద్దచెరువులో చేపపిల్లలను వదులుతున్న ఎంపీ ఈటల, ఎమ్మెల్యే మల్లారెడ్డి



చేపపిల్లలను వదులుతున్న రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ సాయికుమార్ తదితరులు

శామీర్‌పేట్: మత్స్యకారుల అభివృద్ధి కొరకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ సాయికుమార్ అన్నారు. 100 శాతం సబ్సిడీతో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్న 3.60 లక్షల విత్తన చేపపిల్లలను బుధవారం మేడ్చల్ జిల్లా, శామీర్‌పేట పెద్దచెరువులో వదిలారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర మత్స్యశాఖ చైర్మన్ సాయికుమార్, మల్కాజ్‌గిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఎమ్మెల్యే మల్లారెడ్డి వేరువేరుగా విచ్చేసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో మత్స్యకారులను గాలికి వదిలేశారని, ఆంధ్రా కాంట్రాక్టర్లకు మేలు చేశారని ఆరోపించారు. మత్స్యకారుల కుటుంబాల అభివృద్ధికై పంచవర్ష ప్రణాళికలను రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యశాఖ అధికారి పూర్ణిమ, జిల్లా చైర్మన్ మన్నె రాజు, హజ్ కమిటీ సభ్యుడు ముజీబ్, కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరివర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షులు శంకర్‌గౌడ్, జైపాల్‌రెడ్డి, పలువురు స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాద్‌షా గోధుమలు విడుదల



మేడ్చల్‌రూరల్: నూజివీడు సీడ్స్ లిమిటెడ్ కొత్త రకం ఎన్‌డబ్ల్యూఎస్–2194 బాద్షా గోధుమలను బుధవారం మార్కెట్‌లోకి విడుదల చేసింది. ఈ మేరకు గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయలోని నూజివీడు సీడ్స్ కంపెనీలో డిజిటల్ ప్లాట్‌ఫారం ఆన్‌లైన్ ద్వారా మేనేజింగ్ డైరెక్టర్ ప్రభాకర్‌రావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బాద్షా ద్వారా హెక్టారుకు 75 క్వింటాళ్ల వరకు దిగుబడి ఉంటుందని, గోధుమ రస్ట్ మరియు గోధుమ బ్లాస్ వంటి తీవ్రమైన వ్యాధులకు నిరోధకతను కలిగి ఉంటుందని వివరించారు. ఈ గోధుమలు మార్కెట్‌లో మంచి ధర పలుకుతాయన్నారు. తెలంగాణతో పాటు పలు రాష్ట్రాల్లో సకాలంలో నీటిపారుదల మరియు పరిమిత నీటి పారుదల పరిస్థితులలో అనుకూలంగా ఉంటుందని, రైతులు ఈ కొత్త రకాన్ని ఉపయోగించుకొని అధిక దిగుబడి, లాభాలు సాధించాలని కోరారు. కార్యక్రమంలో పలు రాష్ట్రాల డిస్ట్రిబ్యూటర్లు, రైతులు పాల్గొన్నారు.

బోడుప్పల్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలిగా సమత



బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ కాంగ్రెస్ పార్టీ మహిళా అధ్యక్షురాలిగా సమతాయాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్, బోడుప్పల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పోగుల నర్సింహారెడ్డి చేతుల మీదగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలకు కాంగ్రెస్ పార్టీ సముచిత స్థానం కల్పిస్తున్నామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్తామన్నారు. త్వరలో మహిళా కమిటీని పూర్తి స్థాయిలో ఏర్పాటు చేస్తామన్నారు. డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, బోడుప్పల్ ప్రధాన కార్యదర్శి విశ్వంగుప్తా, మహిళలు పాల్గొన్నారు.

ఘనంగా బతుకమ్మ సంబురాలు





జవహర్‌నగర్‌లో బతుకమ్మతో మేయర్ శాంతి

ఘట్‌కేసర్: పట్టణంలోని గురుకుల్ క్రీడా మైదానంలో జన చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలు అంబరాన్నంటాయి. తంగేడు, బంతి, ఛామంతి పూలతో 15 ఫీట్లు బతుకమ్మను తయారు చేసి కోలాటం, ఆట, పాటలతో హోరెత్తించారు. అనంతరం మైదానంలో ఏర్పాటు చేసిన కృత్రిమ నీటి కుంటలో నిమజ్జనం చేశారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్ పర్సన్ పావనీ జంగయ్య, టీపీసీసీ ఉపాధ్యక్షుడు వజ్రేష్‌యాదవ్, కాంగ్రెస్ బీ బ్లాక్ అధ్యక్షుడు మహేష్‌గౌడ్, మాజీ సర్పంచ్ జన చైతన్య సేవా సమితి వ్యవస్థాపకుడు యాదగిరియాదవ్, కౌన్సిలర్లు రామాదేవి, శశికళ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా బతుకమ్మ వేడుకలు

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలో బతుకమ్మ వేడుకలు వైభవంగా నిర్వహించారు. మేయర్ శాంతి ఆధ్వర్యంలో బతుకమ్మ ఉత్సవాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



ఘట్‌కేసర్‌లో భారీ బతుకమ్మతో చైర్ పర్సన్ పావనీజంగయ్య, కౌన్సిలర్ రమాదేవి



గురుకుల్ క్రీడామైదానంలో బతుకమ్మ సంబురాలు

ఉత్సహంగా బతుకమ్మ వేడుకలు

సాక్షి, సిటీబ్యూరో: బతుకమ్మ పండుగను కలెక్టరేట్‌లో 7రోజులుగా ఎంతో ఉత్సాహంగా మహిళా అధికారులు, ఉద్యోగులు జరుపుకుంటుండగా, మిగతా వారందరు సహకరించి, ప్రోత్సహించటం ఆనందంగా ఉందని మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా రెవెన్యూ అధికారి హరిప్రియ అన్నారు. బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ సంక్షేమం, విద్యా, పౌర సరఫరాల శాఖలు సంయుక్తంగా బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మహిళా అధికారులు, సిబ్బందితో కలిసి జిల్లా అదనపు కలెక్టర్, డీఆర్ఓ, జిల్లా ఉన్నతాధికారులు ఆనందోత్సహాలతో బతుకమ్మ ఆటలు ఆడారు. మహిళలందరూ బతుకమ్మ పాటలు పాడుతూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి, టీజీఓ జిల్లా అధ్యక్షుడు, ఎస్సీ అభివృద్ధి శాఖ జిల్లా అధికారి వినోద్‌కుమార్, వివిధ శాఖల జిల్లా అధికారులు పూర్ణిమా, చంద్రకళ, వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.







పూజలకు వెళ్లొచ్చేసరికి ఇంట్లో చోరీ

మేడ్చల్‌రూరల్: బతుకమ్మ, నవరాత్రి వేడుకలకు వెళ్లొచ్చేసరికి గుర్తు తెలియని వ్యక్తులు ఇంట్లో దొంగతనానికి పాల్పడి బంగారు, వెండి ఆభరణాలు దొచుకెళ్లిన ఘటన మేడ్చల్ పట్టణంలో చోటు చేసుకుంది. బాధితుడు, పోలీసుల వివరాల ప్రకారం.. పట్టణంలోని బాలాజీనగర్ కాలనీలో నివాసం ఉండే రాజేంద్రప్రసాద్ కుటుంబం గత మంగళవారం రాత్రి నవరాత్రి, బతుకమ్మ ఉత్సావాల్లో పాల్గొనేందుకు ఇంటికి తాళం వేసి పట్టణంలో నిర్వహిస్తున్న వేడుకల వద్దకు వెళ్లారు. రెండు గంటల తర్వాత రాజేంద్రప్రసాద్ తిరిగి ఇంటికి వెళ్లగా ఇంటి తాళం పగులగొట్టి ఉంది. దీంతో యాజమాని ఇంట్లో వెళ్లి చూడగా ఇంట్లోని వస్తువులు చిందరవందరగా పడి ఉండడం, బీరువా తెరిచి ఉండడంతోపాటు అందులోని బంగారు, వెండి ఆభరణాలు కనిపించకపోవడంతో దొంగతనం జరిగినట్టు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని క్లూస్‌టీమ్‌తో పలు ఆధారాలు సేకరించారు. ఇంట్లో ఉన్న 9 తులాల బంగారం, 5 కేజీల వెండి ఆభరణాలతో పాటు రూ.8 వేల నగదు అపహరణకు గురైనట్లు బాధితుడు తెలిపాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు